శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు చిట్టితల్లి సొసైటీ సభ్యులు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు బుధవారం ఎంఈఓ రుక్మిణి, పాఠశాల హెచ్ఎం గిరిరాజ చేతుల మీదుగా శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు రమాదేవి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. బుధవారం నగరంలోని అరగొండరోడ్డు, మంగసముద్రం, 190 రామాపురం, ఓబనపల్లె, హౌసింగ్‌కాలనీ సచివాలయాల పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడారు. సచివాలయంలో బోర్డును, కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుతురు చేను సచివాలయంలో..

బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేను సచివాలయంలో బుధవారం సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: మండలంలోని ముద్దురామాపురంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. లబ్ధిదారులకు కరపత్రాలు అందించారు.

నేడు సీఎం పుట్టినరోజు వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్/ఐరాల/బంగారుపాళెం/గుడిపాల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. చిత్తూరులో ఇంటి పట్టాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేయనున్నారు. ఐరాల మండలంలో ముందస్తుగా పాఠశాల క్రీడామైదానంలో బుధవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బంగారుపాళెంలో అన్నదానం, గుడిపాలలో డ్వాక్రా మహిళలకు దుస్తుల పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

కొత్తకోటలో వికసిత్ భారత్

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోటలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ప క్కాగా చేయాలని కమిషనర్ అరుణ చెప్పారు. బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి, దిశానిర్దేశం చేశారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

గుడిపాల: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ యాప్‌ను ప్రతి కుటుంబంలో మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించాలని ఆయన సూచించారు.

ఇంటి వద్దకే వైద్యం

ఐరాల/గుడిపాల/తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటివద్దనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఐరాల మండలం కోనగుంటలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గుడిపాల మండలం పేయనపల్లెలో డాక్టర్‌అనూష, తవణంపల్లె మండలం నల్లపురెడ్డిపల్లెలో డాక్టర్ మోహనవేలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తవణంపల్లె: అర్హులైన పౌరులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అరగొండలో బుధవారం రెవెన్యూ అధికారులు, అరగొండ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులచే భారీ ర్యాలీ నిర్వహించారు.